


కొండకు పోతున్న ప్యాసింజర్, బీర్ త్రాగి పొట్ట నింపుకున్న త్రాగుబోతులా నెమ్మదిగా వచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది.

దిగేవాళ్ళను దిగనివ్వకుండా, ఎక్కేవాళ్ళు ఎగబడుతున్నారు. నా చిన్నప్పుడు మా వూళ్ళో కరణం పార్టీ, ప్రెసిడెంట్ పార్టీ మనుషులు కొట్టుకోవడం జ్ఞాపకం వచ్చింది.

రైలు పొడుగునా వెతికాను, ఎక్కడైనా ఖాళీవుంటుందేమోనని. ఊహుఁ... తేనెతుట్టెలో పురుగుల్లాగ లుక, లుకలాడుతున్నారు. అసలే మండిపోతున్న ఎండాకాలం. రాత్రి కాబట్టి సరిపోయింది. పగలైతే ఈ త్రొక్కిడికి పెట్టెకి పదిమంది చచ్చుందురు.

ఇంతలో మా మావ వచ్చి రెక్కుచ్చుకుని లాక్కుపోయి ఒకపెట్టెలో కుక్కేశాడు. నన్నే కాదు, మా పెళ్ళి పార్టీ పాతికమందినీ ఎడ్జస్ట్ చేసేశాడు. లాక్షా గృహదహనం జరిగినప్పుడు భీముడు, తన వారందర్నీ ఎలా బైటికి చేరేశాడో అలా చేశాడు మా మావ. ఆయన దౌర్జన్యం చూసి కొందరు అసహాయులు గొణుక్కున్నారు. అంతకంటే ఏం చేసేట్లు? ఇలా దౌర్జన్యం చేసేవారికే గదా రోజులు అనుకున్నాను.

మూడుసార్లు ముక్కి, ఆరుసార్లు గాలి పీల్చుకుని బయల్దేరింది బండి. ఈ లంకణాల బోటు ఎప్పటికి గమ్యస్థానం చేరు

కుంటుందో?

ఒక బస్సు మాట్లాడితే బాగుంటుందని మా మావకి ఎడ్వయిజ్ చేశాను ఖర్చు ఎక్కువయినా సుఖంగా వుంటుందన్నాను. వింటేనా?

వెనకటి కెవడో ఇష్టంలేని మొగుడు పెరుగులో రాళ్లొచ్చాయన్నాడట. అలా "బస్సు ప్రయాణం వట్టి కుదుపులు,ఆడాళ్ళకి ఆరోనెల్లోనే పురుడొచ్చేస్తది." అన్నాడు.

ఎంగిలి చెయ్యిగూడా విదల్చడని మావకి వాళ్ళ వూళ్లో మంచిపేరుంది, ఇందుకే అయివుంటుంది. ఇంతకీ నా చావుకొచ్చింది మా బావమరది పెళ్ళి అని గొణుక్కోక తప్పలేదు

పెటెలో ఎక్కాను అన్నమాటేగాని ఎక్కడా చోటులేదు, లావెట్రీ ప్రక్కన ట్రంకుపెట్టిమీద చోటు చూపించాడు మా మావ నే నందుకు మొగమూట పడగా ఆయనే చతికిల బడ్డాడు, కాసేపటికి గుర్రు పెట్టాడు.

ఆ పెట్టె ఎలా వుందంటే, లోపల గదులు వున్నాయి. ఆ మూలనుంచీ ఈ మూలకు పొడుగ్గా వరండా వుంది, గదుల్లోకి ఈగ కాదుగదా, దోమగూడా జొరబడడానికి వీల్లేనంత క్రిక్కిరిసి వున్నారు

ఒక గంట అలా నిల్చునేసరికి కాళ్ళు పీక్కుపోసాగాయి . టిక్కెట్టు కొనని దొంగలా ముడుక్కుని క్రింద కూర్చోడానికి మనసు ఒప్పుకోవడం లేదు. (కాసేపటికి అది ఎటూ తప్పదు.) పగవాడికి గూడా వద్దురా బాబూ ఈ ప్రత్యక్షనరకం.

గాలి కొంచెం, కొంచెం కంట్రోలుగా వస్తోంది. దీపాలుగూడా కంట్రోలు కిరసనాయిలు బుడ్లులా వెలుగుతున్నాయి.

వరండాకీ, లోపల గదుల్లోకి, మధ్య ఒక కిటికీగూడా వుంది ఆ కిటికీలోంచి చూస్తే లోపల వాళ్ళంతా చొప్పకట్టల్లా పడున్నారు.

మరో అరగంటకి రైలు ఆగినప్పుడల్లా లైట్లు ఆరిపోసాగాయి. నా నడుములు మాత్రం పీక్కుపోసాగాయి. ఆ రైల్వే మంత్రిగారు ఒక్క సారి ఇందులో ప్రయాణంచేస్తే బాగుండును అనిపించింది.

అర్ధరాత్రి దాటింది.


నేను క్రింద చతికిలబడి చేతులు, తల కిటికీకి ఆనించి జోగసాగాను, బండి కుదుపులకు అప్పుడే నిద్రలోకి జారుతున్నాను. ఇంతలోకే చెవుల్లో బాంబు ప్రేలినట్లయింది,

'అమ్మో' అని ఎవరో కేకేశారు. నిద్రమత్తు వదిలిపోయి, గుండెలు ఆగిపోయాయి నాకు తెలియకుండానే అదిరిపోయి ఆటోమాటిక్‌గా లేచి నిలబడిపోయాను

ఆ కేకకి నిద్రపోతున్న వాళ్ళు కళ్ళు విప్పిచూసి విసుక్కుని మళ్ళీ నిద్రలోకి జారిపోయారు."పీడకల గన్నావా తల్లీ." అంది అందులో ఒక ముసలమ్మ మత్తుగా.

చెడిపోయిన నిద్ర మళ్ళీ పట్టలా. సగం మేల్కొని, సగం స్వప్నస్థితిలోనూ ఆలోచిస్తూ లోపలకి చూశాను, నాకు నిద్రాభంగం చేసిందెవరా? అని.

ఆమెకూడా నాలా కూర్చోడానికి ఆసనంలేదు. రెండు బల్లలకూ మధ్య జాగాలో కూర్చుని వుంది. అప్పుడే నిద్ర లేచిన దానిలా బద్ధకంగా వుంది. తెల్లచీర, ఎర్రజాకెట్ వేసుకుని మల్లెలు, మందారాలు పూసిన లతలా వుంది.




ఏమీ తోచకపోవడంవల్ల అనుకుంటాను. నా సైటంతా అప్పగించేసి, లేత వయసులో అతి సిగ్గుతో అప్పుడే విడుతున్న గులాబీలా అందం ఒలకబోస్తున్న ఆ పిల్లవంక చూశాను నేను అదేపనిగా చూస్తున్నట్లు ఆ గుంట కనిపెట్టేసి, నన్ను చూసి చిన్నగా నవ్వింది.

నా తల గిర్రున తిరిగింది వేలెడు లేదు నాకు ఎదురు ఫోజ్ ఇచ్చిందే యింకా రెండేళ్ళు పోతే దేశాన్ని ఏల్తుంది ఇది మొగుడితో కాపురం చేసేరకం కాదు. ఎంతకైనా తెగించే రకంరా నాయనా అనుకున్నాను.

నేను మరింక రెస్పాన్స్ ఇవ్వలేదు. ఇంకా పీడకలలోనే వుండి నవ్వలేదుగదా! అనుకుని కళ్ళు మూసుకున్నాను. కాని నిద్ర రావడంలేదు. కళ్ళు తెరిచి చూద్దును గదా చిక్కీనట్లే చిక్కి పారిపోయే అడవి లేడిలా ఆ గుంట చూసీ, చూడనట్లు చూస్తోంది.

ఎరుపు రంగులో అందమేకాదు. డేంజర్ గూడా వుందని నాకప్పుడు తోచింది.

నావంక ముసి. ముసి నవ్వులు విసిరి, నిద్రపోతున్న మరొక అమ్మాయిని లేపింది కళ్ళు నులుపుకుంటూ లేచి బద్ధకంగా వళ్లు విరుచుకుంది ఆమె. ఆమె ఒక పెళ్ళికూతురు. ఆ పిల్లకు అక్క అనుకుంటాను.

ఆ పెళ్ళికూతురు చాలాఅందంగావుంది. ప్రాణం వచ్చిన పాలరాతిబొమ్మలా, చిగిర్చిన మామిడికొమ్మలా! స్తంభించిన విద్యుల్లతా? దిగివచ్చిన దేవతా?

నా చూపులు ఆమె వళ్ళంతా పాకుతూ, తనిఖీచేస్తూ వదలకుండా తిరిగాయి.

ఆమె కళ్లు విశాలంగా, ప్రకాశవంతంగా, అందంగా వున్నాయి. అంతేకాదు అమృతంతో నిండిన నయనాల్లా, చల్లగా, తియ్యగా వున్నాయి.

ఒడ్డులను ఒరుసుకుంటూ, తనలో కలుపుకుంటూ, భీభత్సంగా ప్రవహించే ఏటిప్రవాహంలాగ యౌవ్వనం మంచి పొంగులో బుసలుకొడుతూ రుస, రుసలాడుతోంది. అంతెందుకు ఒక్కసారి చూస్తే జన్మ జన్మాంతరాలు జ్ఞాపకం వుండేలా వుంది ఆమె.

వంటిమీద ఎంత బంగారం వుందో ఏమోగాని ఆ మసక వెలుగులో తళ, తళ మెరిసిపోతూవుంది. మన పూర్వ అలంకరణ వైభవం ఆ నవవధువులో కరువు తీరా చూశాను.

మంగళహారతిలా కనిపిస్తున్న ఆమె, నిర్ఘాంతపోయి చూస్తున్న నన్ను చూసి నవ్వింది ఆమె కనుపాపలు మిలమిల మెరిశాయి.

మంచుముక్కలు వంటిమీద పడినట్లు నా శరీరం జలదరించింది. అర్జంట్‌గా జ్వరం వచ్చేసినట్లు నెత్తురు ఒక్కసారిగా వేడెక్కిపోయి గబగబ ప్రవహించటం మొదలుపెట్టింది.

ఇంతలో ఏదో స్టేషన్ వచ్చినట్లుంది. లైట్లు పూర్తిగా ఆరిపోయాయి

కళ్ళముందర చీకటి కమ్ముకుంది

ఆకాశదీపం. అందని మానిపండు అంటారే అటువంటివి జ్ఞాపకం వచ్చాయి నాకు బాగా డబ్బున్నవాళ్ళలాగే వున్నారు. ఈ థర్డ్‌క్లాసులో, ఈ భయంకర భీభత్సంలో, ఈ ప్ర త్య క్ష న ర కం లో, ప్రయాణం చేయడం ఎందుకు?

పాపం వాళ్ళనాన్నకూడా, మా మావకి తమ్ముడో, అన్నో అయ్యుంటారు, అని సరిపెట్టుకున్నాను.

పెళ్ళికూతురు నన్నుచూసి నవ్వడం చూస్తే, నన్నొక రోడ్‌సైడ్ రోమియో క్రింద జమకట్టారనీ, ఇద్దరూ కలసి నన్ను కాలక్షేపానికి ఉపయోగించుకుంటారనీ అనిపించింది నాకు.

ఏమైనా సరే వాళ్ళకా అవకాశం ఇవ్వగూడదనుకుని, క్రింద కూలబడిపోయి నిద్రకి వుపక్రమించాను

అలా ఎంతసేపు కునికానో తెలియదు

నా తలమీద ఎవరిదో చెయ్యిపడినట్లయింది కళ్ళు తెరిచాను అంతా చీకటిగా వుంది. వెలిగీ వెలగనట్లు, వెలుగుతున్నా వెలగనట్లు, ఇంకో క్షణానికి ఆరిపోయే దీపంలాగ ప్రాణాలు బిగబట్టుకుని వెలుగుతోంది కంట్రోలు రైలు లైట్


ఆ చెయ్యి నా చేతిని పట్టుకుంది. అది గాజుల చెయ్యి. నిద్రమత్తులో వున్నానేమో? బుర్ర పనిచేయక 'వూఁ' అని మూలిగాను.

నన్ను పైకి లేపటానికి ఆ చెయ్యి గట్టిగా లాగింది

"ఎవరు?" అన్నాను.

కొంచెం తెలివి వచ్చింది. కాని—

నేనిప్పుడు ఎక్కడ వున్నాను? ఏం చేస్తున్నాను? ఆ చెయ్యి ఎవరిది? ఇంకా



## ఇల్లాలి ముచ్చట్లు కాదు!

నవంబరులో భారతదేశ పర్యటన జరిపిన శ్రీలంక ప్రధాని శ్రీమతి సిరిమావో బండారునాయకె న్యూఢిల్లీలో భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధితో చర్చలు జరిపినప్పటి చిత్రం

---

మగతగానే వుంది

"మధూ! మధూ" అంటూ ఆ చెయ్యి నన్ను గట్టిగా పట్టుకుంది

తల పైకెత్తి చూశాను ముఖం స్పష్టంగా లేదు. ఎవరిదో ఆకారం తళ, తళ తళుకు లీనుతూ కన్పించింది.

వెంటనే మెరుపు మెరిసినట్లు, స్విచ్ వేయగానే ఇంజన్ పనిచేసినట్టు నా బుర్ర పనిచేయసాగింది.

ఆ చెయ్యి పెళ్ళికూతురిది

కీ ఇచ్చిన బొమ్మలాగా లేచి నిల్చున్నాను.

"నీ కోసమే ఎదురుచూస్తున్నాను మధూ!" అంది ఆమె గుడ్డి వెల్తుర్నీ, మసక చీకటినీ ఆమె చూపులు చీలుస్తున్నాయి

"నా పేరు మధుకాదు." అన్నాను.

"నన్నింకా ఏడ్పించకు" అని తన తల నా గుండెలమీద ఆనించింది. నా జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి తన్మయత్వం చెందింది.

లైట్లు పూర్తిగా ఆరిపోయాయి.

ఆమె స్పర్శ తగలగానే నా వళ్లు ఝల్లుమంది సిగ్గో, ఆనందమో. ఏదో తెలియడంలేదు. పరిగెత్తుతున్న పాసింజర్ బండి నా గుండెలమీదనుంచి పోయినట్లు ఉక్కిరి, బిక్కిరై పోయాను నా స్థితి అయోమయం అయిపోయింది. ముచ్చెముటలు పోశాయి

ఎవరైనా చూస్తున్నారేమోనని బిత్తర చూపులు చూశాను అందరూ గాఢ నిద్రలో వున్నట్లున్నారు ప్రక్కనవున్న

మనిషి గూడా కనిపించడంలేదు.

"ఇన్నాళ్లూ ఎలా వున్నావు మధూ?"

"నేనా?"

ఆమెకు శోకం పెల్లగిల్లి వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ, "మధూ! నువ్వు తప్ప నాకీ లోకంలో ఎవరూవద్దు. నీకోసం ఎంత సాహసమైనా చేస్తాను వెళ్ళిపోదాం పద ఎవరికీ తెలియని ఎక్కడికైనా పోయి సుఖంగా వుందాం" అంది సన్నగా.

"అమ్మో!" అన్నాను ఆందోళనగా.

"నా గుండెల్ని ముక్కలు చెయ్యకు మధూ నా ఆశల్ని భగ్నం చెయ్యకు. ఇప్పుడు నేను వెనక్కి ఆలోచించలేను. ఒక క్రొత్తలోకంలోకి వెళ్తున్నాననే సంతోషంలో వున్నాను. నన్ను నరకానికి నెట్టివెయ్యకు." ఆమె మాటలు అమాయకంగానూ, స్వచ్ఛంగానూ, సెలయేటి మర్మర ధ్వనులలా వున్నాయి.

నా కెందుకో ఈ అనుభవం కొంత వేదన కలిగించింది. ఆనందంగా కూడా వుంది. ఉగాది పచ్చడిలా తియ్యగా, పుల్లగా, చేదుగా అనిపించింది ఏం చెయ్యాలో తోచలేదు ఆమెను వదిలించుకుందికి ప్రయత్నించాను. నా చుట్టూవున్న చేతుల్ని లాగాను. కాని ఆమె వదల్లేదు

ఆ మధు ఎవడో? వదిలితే వాడు వెళ్ళిపోతాడేమో అనుకున్నట్లుగా ఇంకా గట్టిగా పట్టుకుంది నేను మధునికాదు మొర్రో అన్నా ఆమె వినేట్లులేదు.

"మధూ! ఇప్పుడు నాకెలావుందో తెలుసా? ఎండిపోయిన పొలంలో వర్షం పడినట్లు హాయిగావుంది, మధూ! ఈ క్షణంలో నాకు నిన్నుమించిన ప్రియతములు ఎవరూలేరు. నీ జీవితమే నా జీవితం, నా సర్వస్వం నీకోసమే! చావవలసివస్తే ఇలాగే ఇద్దరం కలిసి చచ్చిపోదాం." స్టేజీమీద నాటకం వేసే దానిలా ఒకళ్లు చూస్తున్నారనే బాధ లేనట్లే మాట్లాడేస్తోంది.


ఆ పెళ్ళికూతురి పేరేమిటో? అడగాలనుకున్నాను కాని ఇంకా గట్టిగా ఏడుస్తుందేమోనని సందేహించి వూరుకున్నాను ఏమైనాసరే ఆమె మనస్సు మాత్రం దూదిలా మెత్తనిది, సముద్రంలా నిండైనది. ఆకాశంలా విశాలమైంది. ఆమె మధుకోసం ఎన్ని సుఖాలైనా త్యజించగలదు, ఎన్నికష్టాలైనా భరించగలదు, ఎన్నిత్యాగాలైనా చెయ్యగలదు అనిపించింది.

ఆమె 'మధు' కోసం ఎదురుచూస్తూ వుంది ఆ భ్రమలో నన్నే మధు అనుకొంటూ వుంది. నేను కాదని చెప్పినా నమ్మకపోవడానికి కారణం, తను నిర్మించుకున్న ఆశాసౌధాలు కూలుతాయనిభయం. మధు కౌగిట్లోవున్న సుఖం స్వప్నానికి మల్లే తృటిలో అదృశ్యమవుతుందేమోనని బెంగ.

ఆమె మధును గాఢంగా ప్రేమిస్తోంది. ఆ మధు ఆవిడకు ప్రాణం. మధు ఆవిడకు మర్మం, మధు ఆమెకు సత్యం, మధు ఆమె నేత్రజ్యోతి

ఆమె ప్రేమలో మునిగి తేల్తూ ఉన్మాదస్థితిలో వుంది

నిజానికి ప్రేమలా పిచ్చెత్తించేది ఈ




లోకంలో వేరేదీలేదు ప్రేమకు ఆది అంతం లేదని నాకు అనిపిస్తూవుంది. నేను ప్రేమను అనుభవించకపోయినా ఆమె పరిస్థితి చూస్తుంటే ప్రేమలో విషంలాంటి డేంజర్, అమృతంలాంటి తీపి, బ్రాందీలాంటి మత్తు వున్నాయనిపించింది.

"మాట్లాడవేం? మధూ! నేను చేసిన కబురు అందిందో లేదో, నువ్వు వస్తావో రావో? అని ఎంతో భయపడిపోయాను. నిన్ను పోలీసులు తీసుకుని వెళ్ళారని విని ఎంత బాధపడిపోయానో తెలుసా? ఇన్నాళ్ళూ ఆకలి, దాహం మర్చిపోయాను ఏపని చేయడానికీ ఇష్టం పుట్టేదికాదు. శరీరం శిథిలమైంది, సోమరితనం పుట్టింది. మనసులో బాధ, గుండెల్లో మంటలు. నువ్వు దూరమైనందుకు ఎప్పుడూ ఏడ్వాలనిపించేది. మాట్లాడవేం? " అని నన్ను కదిపింది.

"నేను మధునుకాదు. నువ్వెవ్వరివో ఏమిటో? నాకు అర్థంకావడంలేదు." అన్నాను నెమ్మదిగా.

ఆమె నన్ను వదిలింది.

నన్ను ఎవరూ మోసం చెయ్యలేరు. ఇంత సీరియస్‌లో గూడా ఎగతాళిగా మాట్లాడతావెందుకు? లేక ఈ చివరి సమయంలో పిరికివాడివి అవుతున్నావా? మనసు మార్చుకోకు మధూ. నీ చుట్టూ పరిస్థితులు ఎన్నిమారినా, అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ నిన్ను ప్రేమిస్తూనే వుంటాను. నువ్వు లేకపోతే నేను జీవించేది కల్ల" అన్నది.

చీకట్లో ఆమె కనుపాపలు స్ఫటికం ముక్కల్లా మెరుస్తున్నాయి.

మనుషులు దూరంగావున్నా వారిప్రేమ

పచ్చగానేవుంది తావులను వెదజల్లుతూనే వుంది నిజమైన ప్రేమంటే వీరిదేనేమో? అనిపించింది

నామాటలు ఆమె ఎగతాళిగాను, పిరికి తనంగానూ అర్థంచేసుకుంటూవుంది నేనేం చేయాలి? ఏమాత్రం గట్టిగా మాట్లాడినా ఎవరో ఒకరు నిద్రలేవవచ్చు. గొడవ జరగవచ్చు

ఆమె కథ వింటూవుంటే నా గొంతు మూగపోయింది నా మనసు చెమ్మగిల్లింది, మౌనంగా వుండిపోయాను.

నేను ఎంతకీ మాట్లాడకపోవడం చూసి ఆమె నాచెయ్యి పట్టుకుని, "మధూ! నువ్వు ఎందుకు అలావున్నావు? చెప్పు. నన్నేం చెయ్యమంటావు? ఆజ్ఞాపించు నాకీజీవితం మీద పూర్తిగా విసుగుపుట్టింది నీకు ధైర్యం లేకపోతే చెప్పు ఈ పరిగెత్తే రైల్లోంచి దూకుదాం పోవలసిన రోజు వచ్చేటప్పటికి ఈ ప్రాణాలను పోనివ్వడమే మంచిది శరీరంమీద మమకారంతో ప్రాణాన్ని బంధించి, మనసుని చంపి తపనతో కొట్టుకోవడంవల్ల సుఖం ఏముంది?" అంటూ చిన్నగా ఏడ్చింది నాచేతిమీద ఆమె కన్నీరు బొట, బొటకారింది

నాలో అంతకుముందువున్న నిగ్రహం తుత్తునియలై, చేతులు, కాళ్ళూ గజగజ వొణికిపోయాయి

ఆమె మాటలు గుండెల్ని చీల్చుకువచ్చి నన్ను కలచివేచినై తీవ్రమైన ఆవేదన ఆమె చేతినుంచి నాచేతిలోకి ప్రవేశించి, శరీరమంతా వ్యాపించింది లోపల వేదన సుళ్ళుకట్టి తిరుగుతూవుంది

ఆమెను ఒక కన్నుతో నవ్విస్తూ, ఇంకొక కన్నుతో ఏడిపిస్తున్నట్లు అనిపించింది నాకు. నేను 'మధు' అనుకొని ఆమె ఆనందిస్తూవుంది మధు ఎందుకో మారిపోయాడని చింతిస్తూవుంది

నేను మధుని కాదని ఆమెను ఎలా నమ్మించాలో నాకు అర్థంకాలేదు ఒకవేళ నమ్మించినా, ఆ మధు రాలేదని నిరాశతో రైల్లోంచి దూకి చావదుగదా? అని భయం వేసింది. ఆమె ఏమైతే నాకేం? నాకేం సంబంధం? ఎందుకోగాని ఈ ఆలోచన నా మనస్సును కొంచెం కలవరపెట్టింది.

"ఏడవకు" అన్నాను

చిక్కగా చుట్టు ముట్టిన ఆ చీకట్లో, ఆమెను ఓదార్చడానికి ప్రయత్నిస్తుంటే, ఏటి వరదకి గట్టు తెగిపోయినట్లు, ఆమె దుఃఖం మరింత ఎక్కువై పోయింది

ఆమె ఏడుపు వింటుంటే అసలు మనుష్యులు ఒంటరిగా కష్టాలు అనుభవించ లేరు. సుఖాలూ అనుభవించ లేరు అనిపించింది నాకు.

ఇప్పుడు తనతోపాటు కష్టసుఖాలు పంచుకునే వ్యక్తి 'మధు' ఆమె ఎదుట ప్రత్యక్ష మయ్యాడు మధు ఆమె కోసం ఏడవ గలడు, నవ్వ గలడు అవసరమైతే ఆమె కోసం ఆత్మార్పణ చేయగలడు

ప్రేమలో ఎంత డేంజర్ వున్నా, ఆ ప్రేమను నేను అనుభవించనందుకూ, ఆమె వంటి ప్రియురాలు దొరకనందుకూ, నేను ఆమెకు తోడునీడ అయిన మధు వంటి అదృష్టానికి నోచుకోనందుకు విచారం వేసింది

ఆమె కాసేపు ఎవరికీ వినిపించ కుండా నోరు నొక్కుకుని ఏడ్చింది. నాకు మాత్రం వెక్కిళ్లు వినిపిస్తూనే వున్నాయి.

కొండమీదవున్న ఓ దేవుడా? ఏం సృష్టి స్వామీ ఇది? కొందరిమధ్య ప్రేమ లేకుండా ఎందుకు కట్టి పడేస్తున్నావు? ప్రేమ వున్న చోట అల్లకల్లోలాలు, తుపాన్ బీభత్సాలూ ఎందుకు కల్పిస్తున్నావు? అంత చేతగాని వాడివి ఆ పదవిలో ఇంకా ఎందు కున్నావు? రాజీనామా చేసి నీ నిజాయితీ నిరూపించుకోరాదూ? ఎందుకయ్యా నీకీ పదవీ వ్యామోహం?

అనేక ఆలోచనలతో నా మనస్సు కలవర పడింది. ఏం లాభం? నాకు కలవరమే మిగిలింది

ఆమె నా భుజాలు రాస్తూ, నా మెడ మీద చేతులు వేసి, నా ముఖాన్ని దగ్గరగా లాక్కుంది. ఆమె స్పర్శకు నా శరీరం మంచుకు వొణికినట్లు వొణికి పోయింది.

ఆలోచనల మీద ఆలోచనలు ఆ ఆలోచనలు నాకు వెర్రెత్తించేస్తున్నాయి. ఇంకొంచెం సేపుంటే పిచ్చి పట్టేట్టు వుంది పిచ్చెత్తించి కళ్లకి పొరలు కప్పేస్తున్నది. ఆమె జడలోంచి వస్తున్న మల్లెల మత్తు వాసన. ఆమె శరీరపు యవ్వనం సువాసన

మనిషి జీవితంలో కొన్ని ఉన్మత్త సమయాలుంటాయి. నిగ్రహం, నిష్ట ఒక చిన్న సంఘటనతో, ఒక్క క్షణంలో సడలి పోవడానికి అవకాశం వుంటుంది. నేను మధులా ప్రవర్తించి వుంటే?

ఆమె ముఖం చూస్తుంటే నాకెందుకో గౌరవ భావమే కల్గింది ఆమె మాటలు వింటుంటే అజ్ఞాత అంధకారాన్ని చీల్చే జ్ఞానరేఖల్లా వున్నాయి.

మానవత్వం, మనసు వున్న మనిషి ఏ యుగంలోనూ, ఎట్టి పరిస్థితిలోనూ 'మధులా' నటించి ఆమెను మోసగించ లేడు.

నేతి గులాబ్‌జామ్ చేతిలో పెట్టినట్లయింది కాని దాని యజమాని మధు

"ఎందుకు బాధపడుతున్నావు?" అంది.

"బాధ పడటం కాదు. ఆలోచిస్తున్నాను. నువ్విలా పసుపు బట్టలతో పెళ్లి పీటల నుంచి మాయమై పోతే నీ మీద అపవాదు రాదా?" అన్నాను

"ప్రేమించే మనిషి కోసం అపవాదులు, ఆపదలు సహించడానికి తయారుగా లేనప్పుడు బ్రతికి ప్రయోజనం ఏముంది?" అన్నది ఆమె. మానవత్వానికి కొన్ని కనీస ధర్మాలున్నట్లు, ప్రేమకు ప్రిన్సిపల్స్ వున్నాయి అని ధ్వనించాయి ఆమె మాటలు

నేనేం మాట్లాడ గలను?

దున్నపోతూ కనీ ఎరగదు. పాలిచ్చీ ఎరగదని, నేను ప్రేమించీ ఎరగను, నన్నెవరూ ప్రేమించీ ఎరగరు అందుకని మౌనంగా వుండిపోయాను

"మధూ! స్త్రీ జీవితంలో ఇద్దరు ప్రియులుండటం అసాధ్యం అందుకే మనల్ని దేవుడు మళ్లీ కలిపాడు" అంది. ఆమె ఆశావాది అనీ, అన్నీ తనకు అనుకూలంగా అల్లుకునే స్వభావం కలదనీ గ్రహించాను.

"మాట్లాడవేం?"

"అవును" అన్నాను ఆమె తృప్తి కోసం.

"కొమ్మలు నరికినందువల్ల చెట్టు ఎండి పోతుందనుకున్నాడు మా నాన్న" అని నవ్వింది ఆమె.

ఆమె నవ్వు ఆపగానే, ఎవరో దగ్గారు గట్టిగా.

నేను పిరికివాడిని కాదు. కాని ఎందుకో పిరికితనం ప్రవేశించింది నాలో.

నేను లోకులకి గాని వారి తాతలకు గాని భయపడను. కాని ఆ దగ్గుతున్న వాడికి భయపడు తున్నాను.

ఎంత సింహం అయితే మాత్రం తుపాకీ చప్పుడికి భయపడక తప్పుతుందా?

"ఇక వెళ్ళి కూర్చో. ఎవరో లేచారు." అని నేను రెండడుగులు వాకిలి వైపు వేశాను

ఆమె నా చొక్కా పట్టుకుని లాగి "ఎక్కడికి?" అంది

"గాలి రావడం లేదు. వాకిట్లో నిల్చుంటాను" అన్నాను.

'ఫలానా' స్టేషన్‌లో దిగిపోదాం అంది ఆమె.

నా గొంతున పచ్చి వెలక్కాయ పడినట్లు మాటరాలేదు.

"ఏలుంటే " అని మూలిగాను. "తొందర పడకు" అని మరో మాట విసిరాను.

ఆమె చీకట్లో తడుముకుంటూ వెళ్లిపోయింది

'హమ్మయ్య' అని నిట్టూర్చి కూలబడిపోయాను. మోకాళ్ల మీద తల, నెత్తిన చేతులు పెట్టుకుని నిద్ర పోవడానికి ప్రయత్నించాను.

మనసు జరిగిపోయిన రసాత్మకమైన బాధా పూర్వకమైన సన్నివేశాన్ని నెమరు వేయటం ప్రారంభించింది.

మధు కోసం ఆమె ఎంత దుఃఖాన్ని తనలో ఇముడ్చుకొని వుందో? పరిస్థితుల వొరిపిడి వల్ల పుట్టిన హాలాహలాన్ని ఎలా దిగ్రమింగిందో? మనసుని దహిస్తున్న అగ్నికణాల్ని ఎలా భరిస్తూ వుందో కదా?


జీవితంలో ఎన్నో బాధలు, భయాలు, ఆశలు, ఆనందాలు, అవమానాలు, అపజయాలు, సాహసాలు, సాలెగూళ్ళు వున్నాయని నాకిప్పుడు అనిపించింది

'బిడ్డను కనాలంటే పురుటి నొప్పులు తప్పవు నాయనా?' అనేవాడు వెనక మా లెక్చరర్ ఒకాయన అలాగే ప్రేమ ఫలించాలంటే ఎన్ని నొప్పులు భరించాలో?

ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమో? మెలకువ వచ్చేసరికి బండి ఆగివుంది అప్పుడే తెల్లవారుతూ వుంది తూర్పు దిక్కుకు తరలి పోయిన మేఘాలు పర్వతాల లాగ నిలబడిపోయి ఎర్రబడి వున్నాయి. ఇంకా సూర్యోదయం కాలేదు.

పెళ్ళి కూతురు జ్ఞాపకం వచ్చింది.

రాత్రి జరిగిన విషయం ఎవరికైనా చెప్పాలనుకున్నాను. కాని ఎవరికి చెప్పుకునేటట్టు? ఏమని చెప్పుకునేటట్టు? అలా జరగటం చాలా అసందర్భంగాను, అసహజంగాను అనిపించింది. అదంతా ఒక కలలా అనుకున్నాను.




కల అని ఎలా అనుకోను?

ఆమె కన్పించింది.

ఆమె మొఖం చూడలేకపోయాను. నేను మధుని కాదని తెలిసి ఆమె హృదయం ముక్కలై వుంటుందని తెలుసు. ఆమెలో తాండవించే నిరాశను చూడటానికి భయం వేసింది.

ఎంతో ప్రయత్నం మీద ఆమెను చూశాను.

చేతనా రహితంగా నిలబడి పోయింది ఆమె.

పిడుగు పడిన చెట్టుకు మల్లేను, వేటగాని విజృంభణకు బెదిరిపోయి బిత్తర చూపులు చూస్తున్న లేడికి మల్లేను వణికిపోయింది.

ఆమె ఆశలన్నీ మట్టి పాలయ్యాయి. మనోరథాలన్నీ మంటిలో కలిసినై. కలల దుప్పటికి నిప్పంటుకుంది.

ఆమె కళ్లు కెంపుల్లా మారేయి ఆమె మొఖం పండు మిరపకాయలా ఎర్రగా అయింది. మాటి మాటికీ కళ్లు తుడుచుకుంటూ దుఃఖాన్ని ఆపుకుంటూన్నది. ఆమె అసహాయంగా శూన్యంలోకి చూస్తూ వుండిపోయింది

ఒక వేపునుంచి లోకం వెలుగులోకి వస్తుంటే, నా హృదయం అంధకారంలోకి వెళ్లినట్లయింది.

ఒక స్టేషన్ లో కాంటీన్ ముందు నిల్చుని కాఫీ త్రాగుతున్నాను.

నెత్తిన తలపాగా, నీరు కావి బట్టలు, మాసిన తెల్ల గడ్డం, పగిలిన భూమిలాగ నెర్రెలిచ్చినట్లున్న ముడతల మొఖం, "మధు బాబూ!" అన్నాడు ఆత్రంగా.

నేనే మాత్రం ఆశ్చర్యపడలేదు. ఆ మధుగాడి పోలికలు కొంచెం నాకున్నాయని అర్థమై పోయింది.

నేను విచిత్రంగా చూశాను.

"వద్దు బాబూ! వెంటనే ఎల్లిపో. అయ్యగారు చూస్తే చానా ప్రమాదం." అన్నాడు

"నేను మధును కాదు." అన్నాను.

దగ్గరగా వచ్చి చూసి, నేను మధుని కాదని నిర్ధారణ చేసుకుని 'చూపు ఆనడం లేదు' అనుకుంటూ వెళ్ళిపోయాడు ఆ ముసలాడు

కొండ స్టేషన్ చేరాక మరి నాకా పెళ్లి కూతురు కనిపించలేదు.

కాలేజీలోకి ప్రవేశించాక ప్రాణం కుదుట పడింది రాత్రి సరిగా నిద్రలేనందు వల్ల కళ్లమంట సాగాయి రోజు కంటే కొంచెం ముందుగానే భోజనం చేసి పడక వేశాను. అర్ధరాత్రికి పెళ్ళి గనుక ఇప్పట్లో హడావుడీ ఏమీలేదు. అందునా క్రొత్తల్లుడిని కాబట్టి పని నెత్తిన పడలేదు.

మూడింటికి మెలకువ వచ్చింది. స్నానంచేసి బట్టలు వేసుకున్నాను ఎవరి పనిలో వాళ్లున్నారు. ఏం తోచక దేవాలయం దగ్గరికి బయల్దేరాను

వచ్చేపోయే జనాన్ని చూడడం తప్పితే అక్కడా ఏం తోచలేదు. కాలక్షేపానికి రెండు పత్రికలు కొనుక్కుని కాలేజీకి తిరిగి వస్తున్నాను.

కాలేజీ కొంచెం దూరంలో వుండనగా మా మావ వురుకులు, పరుగులుమీద నాకు ఎదురు వచ్చాడు మనిషి ఎందుకో కంగారుగా వున్నాడు. మొఖం చెమట పట్టేసి వుంది. గంభీరంగా నిండు కుండలావుండే మనిషి భయంతో నీళ్ళు కారిపోతున్నాడు. మా మావ వెనక పరివారమంతా వున్నారు. అంతా ఆందోళనగానే వున్నారు.

నన్ను చూసి ఎక్కడి వాళ్లక్కడ మంత్రించిన వాళ్ల'లా స్తంభించిపోయారు.

"ఏం జరిగింది?" అని ప్రశ్నించాను.

మా మావ తేరుకుని ప్రక్కనున్న మా పెద్ద మావ మనవడి జుట్టు లంకించుకుని చురుగ్గా నాలుగూ అంటించాడు. నెత్తిన తాటికాయపడిన కుక్కలా వాడు 'కుయ్యో! మొర్రో' అన్నాడు అంతలోకే మా బావ మరది ముందుకు వచ్చి విడిపించాడు.

నా కదంతా ఓ మిస్టరీ అనిపించింది. వీళ్ళంతా ఎక్కడికి బయల్దేరారు? ఎందుకు ఆందోళన పడుతున్నారు? నన్ను చూసి ఆగిపోయా రెందుకు? మా మావ ఆ పిల్లవెధవని కొట్టాడెందుకు?

"ఏమిటోయ్ ఇదంతా?" అన్నాను మా బావ మరది వంకచూసి.

వాడు కిసుక్కుమన్నాడు. సోడా కొట్టిన శబ్దం వచ్చింది వాడి నవ్వుకి, ఏడుపుకీ పెద్ద తేడా కన్పించదు. నవ్వుతున్నాడో లేక ఏడుస్తున్నాడో నాకు అర్థం కాలేదు.

"నిన్ను ఎవరో పొడిచారని సాంబడు జోక్ చేసి, మమ్మల్ని ఫూల్స్ చేశాడు, మేమంతా కంగారుగా బయల్దేరాం." అన్నాడు మా బావ మరది.

"ఏరా సాంబిగా! ఇది ఏప్రియల్ ఫస్టు గూడా కాదే. నీ జోక్ పాడుగానూ!" అన్నాను.

"జోక్ కాదు. నిజం. నిన్ను ఎవరో పొడిచారు."అన్నాడు సాంబడు ఏడుస్తూనే.

అంతా పగలబడి నవ్వుకుంటూ చెల్లా

చెదురై కాటేజీలోకి వెళ్ళిపోయారు.

నాకు నవ్వు రాలేదు వాడి మాటలు చురకత్తుల కంటే పదునుగా నా గుండెల్లోకి దిగాయి ఆ పెళ్ళి కూతురు జ్ఞాపకం వచ్చింది. వెంటనే నేను ఎన్నడూ చూడని మధు తలపుకు వచ్చాడు

ఇప్పుడు అర్ధమైంది. మధు ఆమెకోసం వచ్చి వుంటాడు. నాతల గిర్రున తిరిగింది. కాళ్లు వణికాయి. పూనకం వచ్చిన వాడి మాదిరిగా గబ, గబ అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు

జనం మూగివున్నారు.

పోలీసులు అదుపు చేస్తున్నారు.

పులి చంపిన మేకలా పడివుంది శవం. నెత్తుర్లో మునిగిన మల్లెపువ్వుల్లా వున్నాయి తెల్లబట్టలు, నేలమీద కారిన నెత్తురు ఇంకా పచ్చిగానేవుంది

అతను మధు కాదు ఆ శవం మధు

సూర్యుడి తేజము, బంగారు మెరుపు, వజ్రాల కాంతీ అతని ముఖంలోచూశాను సాధువులా, శాంతంగా, సౌమ్యంగా చిరునవ్వుతో నిద్రపోతున్నట్లు అనిపించాడు మధు

ఎక్కువసేపు చూడలేక కళ్లుమూసుకున్నాను. చూసింది కాసేపే అయినా, ఆ దృశ్యాన్ని జన్మ, జన్మలకూ మర్చిపోలేననిపించింది.

తగలబడుతున్న మనసుని చిక్కబట్టుకున్నాను కళ్లలోంచి వుబికి వస్తున్న కన్నీరు తుడుచుకున్నాను.

నా హృదయం నిప్పులమీద వుడుకుతున్న అన్నంలా తుక, తుకలాడింది.

ఈ హత్య వెనకవున్న శక్తులు, వ్యక్తులూ ఎవరో లీలగా నాకు అర్ధమవుతూ వుంది

అలా అర్ధం కాగానే, ఒక సుడిగుండం నన్ను చుట్టు ముట్టినట్లయింది, అగ్ని పర్వతం నా కళ్ల ముందే పగిలినట్లయింది. భూకంపంవచ్చి భూమి బ్రద్దలైనట్లయింది.

ఎవరికోసం ఈ మనుష్యులు ఈ ఘోర కృత్యం చేసినట్టు? ఎవరి సుఖం కోసం? ఇంతేనా ఈ లోకంలో ప్రాణం విలువ?

ఇందుకేనా ప్రేమించుకునేది?

పేగులు ముడిపడినట్లు బాధపడ్డాను.

నా గుండెల్లో వెయ్యి గొంతుకలు ఏడుస్తున్నాయి.

ఆ మధుతో నాకు పరిచయం లేకపోయినా అతనిమీద నాకు విపరీతమైన సానుభూతి కలిగింది

ప్రేమకోసం ఇంతదూరంవచ్చి దిక్కులేని చావు చచ్చాడు.

ఆ ముసిలాడు కన్పించాడు.

నన్ను చూస్తూనే అతని మొఖం పాలిపోయింది గడ గడలాడి పోతున్నాడు. చెమటలు పోసి వణుకుతున్నాడు.

"తాతా .." అని పలకరించాను.

అతను కన్నీళ్లు తుడుచుకుని ఒకబండ మీద కూలబడిపోయాడు. ఎంతో అలసిపోయినట్లు కన్పించాడు మనిషి.

"వూఁ " అన్నాడు.

"నీకు ఈ మధుబాబు తెలుసా?" అని ప్రశ్నించాను.

తాత నా వంక విచిత్రంగా చూశాడు.

"తెలుసు." అన్నాడు వణుకుతున్న కంఠంతో.

"రాత్రి రైల్లో ఒక పెళ్ళి కూతురు నన్ను మధు అనుకుని "

తాత అర్ధోక్తిలో అందుకుని "నాకు తెలుసు బాబూ! రాధమ్మ నా కంతా చెప్పింది " అన్నాడు కళ్లు తుడుచుకుని

"అయితే తాతా, నాకు అర్థం కాలేదు వీళ్ళ కథ. చెప్పు " అన్నాను తాతకు ఎదురుగా వున్న మరొక బండరాయిమీద కూర్చుంటూ.

"చెప్పడాని కేముంది బాబూ! మని షికి అనేక కోరికలుంటాయి. అన్నీ తీర తాయా" అన్నాడు.

నీ మెట్ట వేదాంతం మండిందిలే అని లోపల అనుకుని పైకి "ఎలా తీరతాయి తాతా?" అని ఎదురుప్రశ్న వేశాను.

"నీ పాటి తెలివి ఆ మధుబాబుకి లేక పోయింది డబ్బున్న అమ్మాయితో సంబంధం పెట్టుకోడం పొట్టలో బంగారు బల్లెంతో గుచ్చుకోవడంతో సమాననునీ, విచ్చేనకు స్వర్గం అందదనీ ఎన్నోసార్లు చెప్పాను. కాని వినలేదు, ప్రేమ ప్రేమ అనే వాడు. రాధ దక్కకపోతే చచ్చిపోతా ననే వాడు. అలాగే జరిగింది " అన్నాడు తాత విచారంగా

"అయితే మధు ఆత్మహత్య చేసు కున్నాడా ?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"ఎలా తెలుస్తుంది" అన్నాడు తాత.

"ఆ రాధకి, మధుకి ఎలా ప్రేమ కలి సింది?" అన్నాను.

"ఎలా తెలుస్తుంది?" అన్నాడు మళ్ళీ తాత

"ఇద్దరిదీ ఒక్కవూరేనా ?"

"కాదు. రాధమ్మ నాన్నకి బియ్యం మిల్లువుంది. అందులో పనిచెయ్యడానికి ప్రక్కవూరునుంచి వచ్చాడు మధుబాబు. ఏడెనిమిదేళ్ళయింది అప్పుడు రాధమ్మ పదేళ్ళ పసిపిల్ల "

"అయితే చిన్ననాటి అనురాగం అన్న మాట "

"అవును బాబూ! బావా మరదళ్ళలాగే చిలిపిగా, సరదాగా, నవ్వుకుంటూ వుండే వాళ్లు. వయసులో వున్న మనసులు పువ్వు ల్లాంటివి. వాళ్ళని ఎవరూ పట్టించుకునే వారు కాదు రాధమ్మ చదువుకుంటూ వుండగా పెళ్ళి సంబంధాలు వచ్చాయి. డబ్బునోళ్లు బాబూ! ఆ పిల్లను చేసుకో డానికి ఎవరైనా ముందుకు వస్తారు. అప్పుడు రాధమ్మే మనసులో మాట తల్లికి చెప్పింది మధు అంటే ఆ తల్లికి గూడా ఇష్టమే కాని తండ్రిమాత్రం 'కంయ్' మంటూ ఇంతెత్తు ఎగిరాడు. ససేమిరా ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదన్నాడు "

"అర్థమయింది "

"ఏమర్థమయింది బాబూ! మాకామందు మామూలు మనిషి కాదు భారతంలో శకుని, కృష్ణుడుగూడా ఆరిముందు సాలరు.. బియ్యం మిల్లులో డబ్బుపోయిందని కేసు పెట్టి మధుబాబుని పోలీసులకి పట్టించాడు. మధుబాబుకి నాన్నలేడు. మేనమామ, తల్లి వచ్చి మా కామందు కాళ్లు, గడ్డాలు పట్టు కున్నారు. ఈ కసాయోడు వింటేనా? డబ్బు కక్కమన్నాడు వున్న పొలం కాస్త అమ్మి డబ్బుకట్టింది తల్లి "

"వూఁ " అని నిట్టూర్చాను.

"రాధమ్మ మాత్రం పెంటపోగులో

మల్లెపూవు బాబూ. అంత నీతిగల మనిషి. చేసుకుంటే మధునే చేసుకుంటాను. లేక పోతే ఇక బ్రతకను.'' అని తెగించి చెప్పే సింది. కాని కామందు వట్టి మూర్ఖుడు. డబ్బుంది కాని మనసులేదు ఆయనగారి పద్ధతి ఎలా వుంటుందంటే కొడుకు బాగుం డాలి. కోడలు ముండమొయ్యాలి' అంటాడు.''

''మరి రాధమ్మ ఇష్టంలేని పెళ్లికి ఎందుకు ఒప్పుకుంది?'' అన్నాను.

''వస్తున్నాను ఒకసారి రాధమ్మ ''నా జీవితం తెగిన గాలిపటంలా అయ్యింది తాతా! బ్రతికినందువల్ల ప్రయోజనం ఏముంది? నేను ఎంతమాత్రం బ్రతకవల సిన అవసరంలేదు. మనసొకచోట, మను గడ ఒకచోట.ఆ నరకం నేను భరించలేను. మధుకోసం కాకపోతే నా జన్మ ఎందుకు?'' అని చెప్పుకుని ఏడ్చింది నేనూ కాసేపు ఏడ్చి వూరుకున్నాను మధుకోసం గంగ వెర్రులెత్తే స్థితికి వచ్చింది. నేనేం చెయ్య గలను '' అని తాత కాసేపు ఆగి, మళ్లీ మొదలుపెట్టాడు ''ఇంట్లో పోరగా, పోరగా, చివరికి రాధమ్మ ఈ పెళ్లికి ఒప్పు కుంది పెళ్లికొడుక్కి మొక్కు వుందని పెళ్లి ఇక్కడచేస్తున్నారు నేను ఈ వార్త మొదట్లో నమ్మలేకపోయాను రాధమ్మని అడిగితేనవ్వి నిజమే అంది. కాని మధు కోసంకబురుచేసిందనీ, మధు వస్తే అత నితో వెళ్ళిపోవడానికి సిద్ధపడిందనీ నాకు తెలియదు '' అన్నాడు తాత

''అలాగా.'' అన్నాను అర్థమైందని తలూపుతూ.

ఈ డబ్బునోళ్ళతో అన్నీ చిక్కులే బాబూ. ఇష్టమైందా, కొంపలు తీసేవాడిని నెత్తిన పెట్టుకుంటారు. ఇష్టం లేక పోయిందా, మంచివాడి కొంపలుగూడా తీసేస్తుంటారు '' అన్నాడు తాత కసిగా.

''అందరూ అలా ఎందుకుంటారు?''

''ఎక్కువమంది అలాగే వున్నారు.'' అన్నాడు తాత డబ్బున్నవాళ్ళంటే వున్న కసి కొద్దీ

''వూఁ '' అన్నాను.

''అసలు వయసులో వున్న వాళ్ళు వెర్రివాళ్ళు అబ్బాయి. అంతా ఆళ్ళ ఆలో చనలకు అనుకూలంగా నడుస్తుందని అనుకుంటారు ఏవో కలలు కనేస్తారు. తమ చుట్టూ బలమైన కోటలు కట్టుకుం టారు, కాని అవి పేకమేడల్లా కూలి పోతాయని నా వంటివాడు చెప్పినా నమ్మరు బాబూ!'' అన్నాడు తాత.

''తాతా!''

''వూఁ ''

''మధు చనిపోయిన విషయం రాధకు తెలుసా?'' అన్నాను.

''తెలిసే వుంటది ''అని తాత లేచాడు.

తాత వెనక నేనూ అడుగులు వేశాను.

''అయితే ఈ పెళ్ళి ''

''రాధమ్మ చేసుకోదు. అంతేకాదు రాధమ్మ ఇంక బతకదు. ఆ బిడ్డ మనసు నాకు తెలుసు.''

''అంతేనా?''

''అంతే రాధమ్మ తండ్రికంటే మొండి మనిషి.'' అంటూ, ఏదో గొణు క్కుంటూ వెళ్ళిపోయాడు.

తాత వెళ్తున్న వేపుకే చూస్తూ నిల్చుండి పోయాను. ఆమాటలకి గుండెలు ఎందుకో దడ దడ కొట్టుకున్నాయి. రక్తం వెచ్చగా పారింది.

జీవితాలు విచిత్రంగా కన్పిస్తున్నాయి నాకు. ఈ ప్రపంచం వింతగొల్పుతూ వుంది. కొందరు దేవతల్లా ప్రవర్తిస్తుంటే మరికొందరు రాక్షసుల్లా రక్తం త్రాగుతున్నారు

పులిని పులి తినదు. కాని మనిషి మనిషిని తినేసి త్రేవ్‌మని త్రేనుస్తున్నాడు. డబ్బే లోకంగా భావించేవారికి పాపం అన్నా, నరకం అన్నా ఏం భయంలేదని నాకర్థమయింది. పెద్దచేప చిన్నచేపలను తింటున్నట్లే పెద్ద మనుష్యుల ముందు చిన్న మనుష్యులు నాశనం కావలసిందేనా? అని నేను బాధపడ్డాను

విధి, దురదృష్టం అని వేటినంటారో, వాటి అర్థమేమిటో నాకిప్పుడు తెలిసింది.

రాధను ఇప్పుడు పరాయి మనిషిగా చూడలేకపోయాను. ఎందుకో నాకు ఆత్మీయురాలై పోయింది. "రాధమ్మ ఇక బ్రతకదు" అన్న తాత మాటలు ఇంకా వినిపిస్తూనే వున్నాయి నాకు.

సూర్యుడు పడమటి లోయలోకి దిగిపోయాడు. ఆకాశం మధు నెత్తురులా ఎర్రబడింది. కామందులా నల్లటి చీకటి తరుముకొచ్చింది.


తాత నెమ్మదిగా అడుగులు వేస్తూ దూరంగా కన్పించాడు. తాతను వెంబడించాను.

పెళ్ళికి సన్నాహాలు జరుగుతున్నాయి. కాటేజిముందు కొన్ని కుర్చీలు వేసి వున్నాయి. ఎక్కువభాగం పిల్లలు ఆక్రమించి ఆడుకుంటున్నారు. పెళ్ళికొడుకు సీరియస్‌గా, నవ్వితే ఎక్కడ ముత్యాలు రాలిపోతాయో అన్నట్లుగా వున్నాడు. ఆ పెళ్ళికొడుకుని చూస్తేనే నాకు ఎందుకో వొళ్ళు మండుకొచ్చింది. ఎంత గర్వం? ఎంత గొప్ప? ఎంత అతిశయం? ప్రతీ మూమెంట్‌లోనూ తనకు డబ్బున్నట్టు, హుందాగా ప్రవర్తించాడు, పెద్ద ప్రిన్స్ ఆఫ్ నైజామ్‌లాగా, అటూ, ఇటూ, ఇటూ, అటూ పచార్లు చేస్తూ కుక్కల్నిచూసే ఏనుగులా అందరి వంకా చూశాడు

చల్లటిగాలి వీస్తున్నా, నాహృదయంలో ఆవేదన చల్లారలేదు మధు ముఖమే చెక్కుచెదరకుండా నిల్చిన జ్ఞాపకపు మడతలా కన్పిస్తోంది,

రాధ తండ్రి ఏదో హడావుడీ చేస్తున్నాడు, తాత అతని వెనకే వున్నాడు. ఏదో పనిచేస్తూ నేను రాధ తండ్రిని గుర్తుపట్టాను. పెద్ద ఎనుబోతులా వున్నాడు. గామా పహిల్వాన్నీ, కింగ్‌కాంగ్‌నీ చెరో చెత్తో కొట్టి చంపగలడనిపించింది ఆముఖం చూస్తుంటే హిరణ్యకశిపుడూ, రావణాసురుడు లాంటి పాత విలన్లు గుర్తుకు వచ్చారు. అతని అంతరంగంలో ఎంత అమానుషత్వం, పశుత్వం, ఎంత నిర్దయ, హింస, మోసం, కపటం, దాక్కుని వున్నాయో నాకు తెలుసు.

అతనేకాదు. అక్కడున్న మరికొందరు కూడా మనుష్యుల్ని తినే పులుల్లాగ, ఏనుగును వెనకనుంచి దెబ్బకొట్టే సింహాల్లాగ,



ముప్పై ఏతొమ్మిదేళ్ళ క్రితం పుట్టింది
నోటబుల్ హాస్యము
అది వింటూ చేసింది గోదావరి
ఆనందపు లాస్యము
నవ్వే పెదవుల్ని—నవ్వలేని
హృదయాల్ని కనగల కమెడియన్
హీనజనులు—దీనజనులు
బాధితులూ—శోధితులూ కారంటా
డతనికి బర్డెన్
బలి, శిబి, దధీచి, కర్ణులను
అనుసరించు మంచివాడు
లారెల్, లూయిస్, చాప్లిన్ లంతటి
గొప్పవాడు
చాచిన ఏ హస్తము
అవ్వదు అతడిముందు రిక్తము
రాజబాబు చేస్తాడు మంచి కామెడీ
అంతకుమించి చూపిస్తాడు జనం మెచ్చు
హ్యూమానిటీ
ఎంత రాసినా కొంచెమే అవుతుందేమో
అనిపించే గ్రేట్ మేన్
కనుక ముగిస్తూ చెప్తున్నాను అతనికి
నా పార్డెన్.

---

కోరలున్న అడవిపందుల్లాగా కన్పించారు.

ఇద్దరు ముత్తయిదువలు చెరో చెయ్యి పట్టుకుని రాధను తీసుకుని వచ్చారు.

పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు

మంగలివచ్చి కాళ్ళ గోళ్ళు తీశాడు

పురోహితుడు ఏవో మంత్రాలు చెప్పి, దంపతుల్ని స్నానం చేయించమన్నాడు

పెళ్ళి కొడుకుని, పెళ్ళి కూతుర్ని పుష్కరిణిలో స్నానానికి తీసుకుని వెళ్ళారు. నేను వాళ్ళకంటే ముందుగా వెళ్ళి కోనేటి దగ్గర నిల్చున్నాను.

ఏం జరుగుతుందో నాకు అర్థం కావడం లేదు. ఈ పెళ్ళి జరుగుతుందా? లేదా? జరుగుతుంది. లేదు. ఎలా చెప్పడం?

పెళ్ళి కూతురు, పెళ్ళి కొడుకు వేరై పోయారు

స్నానాలు పూర్తయ్యాయి. కాటేజీకి వెళ్ళారు.

రాధమ్మ పెళ్ళయింది.

నా కడుపు మండి పోయింది. ఆ తాత కన్పిస్తే కాలుతో ఒక తన్ను తన్నాలని పించింది.

పాపం మధు ఎంత అమాయకుడు?

రాధ! ఎంత తేలిగ్గా మర్చిపోయింది మధుని? రాత్రి అన్ని మాటలు చెప్పిన ప్రియురాలేనా ఈమె? ఛీ నీచమైన మనుగడ కోసం, ప్రేమకే కళంకం తెచ్చి పెట్టింది. ఇటువంటి స్వార్థపరులు వుండబట్టే ప్రేమకు విలువ లేకుండా పోయింది.

దీని కపటం తెలుసుకోలేక పోయిన మధు, ఓక్కుసారి చావు చచ్చాడు. ప్రేమకు బలై పోయాడు.

రాధమ్మ పెళ్ళి చేసుకుంది.

రేపు కార్యం చేసుకుంటుంది.

భర్తతో కాపురాని కెళ్తుంది

తర్వాత బిడ్డల్ని కంటుంది

ఉత్తమఇల్లాలని పేరు తెచ్చుకుంటుంది.

కాని ఒక హంతకురాలని ఎవరికి తెలుస్తుంది?

ఈ కిరాతకిని నమ్మి మధు అనే ప్రేమ జీవి ప్రాణాలు త్యాగం చేశాడని ఎలా తెలుస్తుంది చరిత్రకి.

ఇంకా ఆమె మొఖం చూస్తూ కూర్చోవడం పాపం అనిపించి మా కాటేజీకి వెళ్లాను.

నేను అదోలా వుండడం చూసి అందరూ ఆందోళన చెందారు. వంట్లో బాగా లేదన్నాను.

ఆ రాత్రి మా బావ మరిది పెళ్ళయి పోయింది. నాకు నిద్ర సరిగా పట్టలేదు.

ఉదయం లేస్తూనే మా పెద్ద మావయ్య మనవడు సాంబడు ఒక దుర్వార్త మోసుకు వచ్చాడు

"ఎవరో పెళ్ళి కూతురు కోనేట్లో పడి చచ్చిపోయిందట" అని.

ఆ వార్త వింటూనే మా మావ వాడి నెత్తిన ఒక మొట్టికాయ వేసి, "చంపుతాను వెధవా? వెధవ్వేషాలూ నువ్వూనూ!" అని కేకలు వేశాడు.

"నిజం తాతయ్యా! కావాలంటే వెళ్ళి చూడండి. అందరూ వెళ్ళి చూస్తున్నారు. ఆ అమ్మాయి పెళ్ళి రాత్రేనట అయ్యింది" అన్నాడు.

నా గుండె ఆగిపోయింది.

రాధమ్మ కాదు గదా?

ఏమో?

అందరూ కోనేటి వైపు వెళ్లారు నేనూ బయల్దేరాను.

రాధమ్మ శవం చూసి ఆగిపోయాను.

కొందరు ఏడుస్తున్నారు కొందరు నెత్తీ నోరూ బాదుకుంటున్నారు మగవారు ఏడవలేక దిగాలు పడిపోయి చూస్తున్నారు. ఆ వాతావరణం హృదయ విదారకంగా కన్పించింది

నా మెదడులో మరుగుతున్న ఆవేదనలు, గుండెల్లో పొర్లుతున్న ఆవేశాలూ ఒకచోట సంగమించి కన్నీళ్ళుగా బైటపడ్డాయి.

"రాధమ్మా! నన్ను క్షమించమ్మా! నిన్ను అపార్థం చేసుకున్నాను నువ్వు దేవతవు" అని ఆమె శవం కాళ్లు పట్టుకుని అనాలనిపించింది.

అనుకోవడం వేరు. ఆచరించడం వేరు.

నా కన్నీళ్లు చూసి, మా ఆవిడ "మీదెంత మెత్తని మనసండీ!" అన్నది

నేనేదో చెప్పాలని ప్రయత్నించాను. కాని సాధ్యం కాలేదు.

పెనవేసుకు పోయిన మానవ సంబంధాలు ఇంత పుటుక్కున తెగిపోతూ వుంటే మనుగడకు అర్థం ఏమిటి?

ఈ లోకం నాకు శూన్యంగా కనిపిస్తోంది.

★